నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, గురువారం 29 ఆగస్టు 2024 HYDERABAD



ఎయిర్‌పోర్టు వద్ద గులాబీ శ్రేణుల సందడి.. పిడికిలి బిగించి అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత



బంజారాహిల్స్‌లోని నివాసానికి సోదరుడు కేటీఆర్ చేయి పట్టుకొని వెళ్తున్న కవిత



# డాటర్ ఆఫ్ ఫైటర్..

## ఎమ్మెల్సీ కవితకు అపూర్వ స్వాగతం

*అదే ధైర్యం.. అదే నిజాయతీ.. మార్చి 15న ఈడీ అధికారులు అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకెళ్లిన సమయంలో కవిత ఎలాగైతే ధైర్యంగా వెళ్లారో.. అంతే ధైర్యంతో నగరానికి తిరిగొచ్చారు. 'డాటర్ ఆఫ్ ఫైటర్' అని నిరూపించారు. రాజకీయ కక్ష సాధింపునకు జడవలేదు.. నెలల తరబడి జైలులో పెట్టినా తలవంచలేదు.. ఆరోగ్య సమస్యలు చుట్టు ముట్టినా బెదరలేదు.. ఎంతో సహనంతో న్యాయ విచారణ ఎదుర్కొన్నారు. ఏ తప్పు చేయని తనకు.. న్యాయమే దక్కుతుందని బలంగా విశ్వసించారు. చివరికి న్యాయమే గెలిచింది. సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బుధవారం నగరానికి వచ్చిన కవితకు అపూర్వ స్వాగతం లభించింది. అభిమానులు, గులాబీ శ్రేణులు ఆమెపై పూలవర్షం కురిపించి.. తమ అభిమానాన్ని చాటుకున్నారు.*

*- సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ)*

**ఎయిర్‌పోర్ట్ వద్ద పూల వర్షం కురిపించిన అభిమానులు**

**జై కవితక్క.. జై కేసీఆర్.. న్యాయం గెలిచిందన్న..**

**నినాదాలతో దద్దరిల్లిన ఎయిర్‌పోర్ట్ ప్రాంగణం**

**బంజారాహిల్స్ నివాసం వరకు దారిపొడవునా గులాబీ శ్రేణుల సందడి**

**అందరికీ అభివాదం చేస్తూ పలకరించిన కవిత**

**సోదరుడు కేటీఆర్‌కు రాఖీ కట్టిన కవిత.. సోషల్ మీడియాలో వీడియో వైరల్**

**భావోద్వేగానికి గురయ్యామంటూ నెటిజన్ల పోస్టులు**

**ఢిల్లీ నుంచి** బుధవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు ఎయిర్‌పోర్ట్ వద్ద అభిమానులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. 'డాటర్ ఆఫ్ ఫైటర్'..జై కవితక్క.. న్యాయం గెలిచింది.. బీఆర్‌ఎస్ జిందాబాద్'.. నినాదాలతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణం దద్దరిల్లింది. అభిమానులు, గులాబీ శ్రేణులు ఎమ్మెల్సీ కవితపై పూల వర్షం కురిపించారు. గజమాలతో సత్కరించారు. అభిమానులు ఆమెతో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. అందరికీ అభివాదం చేస్తూ ఎమ్మెల్సీ కవిత ముందుకు కదిలారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో రాత్రి 7:30 గంటలకు బంజారాహిల్స్‌లోని ఇంటికి చేరుకున్నారు. దారి పొడవునా అభిమానులు సందడి చేశారు. ఐదు నెలల తర్వాత కవిత హైదరాబాద్‌కు చేరుకోగా, ఆమె వెంట భర్త అనిల్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, సంతోష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

### సందడే సందడి..

సంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో ఎమ్మెల్సీ కవితకు బంజారాహిల్స్‌లోని ఆమె ఇంటి వద్ద అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు నృత్యాలు చేస్తూ అలరించారు. 'మా ఇంటి బతుకమ్మ వచ్చిందం'టూ మంగళహారతి పట్టారు. ఇంటికి చేరుకున్న కవిత భావోద్వేగానికి లోనయ్యారు. తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ పేరుపేరునా అందరిని పలకరించారు. కవితతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు.

### సోదరుడి చేయి పట్టుకొని..

సోదరుడు కేటీఆర్ చేయి పట్టుకొని కవిత వస్తున్న దృశ్యాలు ప్రతి ఒక్కరిని భావోద్వేగానికి గురి చేశాయి. జై కేటీఆర్, జై కవితక్క.. అంటూ నినదించారు. ఇంటికి చేరుకున్నాక కేటీఆర్‌కు కవిత రాకీ కట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రతి ఒక్కరూ భావోద్వేగానికి గురయ్యామంటూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. రాఖీ పండుగ రోజు కవిత లేని లోటును గుర్తు చేసుకొని కుటుంబసభ్యుల కండ్లు చెమ్మగిల్లాయి. సోదరుడు కేటీఆర్‌కు కవిత రాఖీ కడుతున్న వీడియో అభిమానుల్లో నూతనోత్సాహాన్ని తీసుకొచ్చిందని పలువురు పోస్టులు పెట్టారు. కవితపై అక్రమంగా కేసు బనాయించి ఇన్ని రోజులు ఇబ్బంది పెట్టడం అన్యాయమని బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ కువైట్ అధ్యక్షురాలు అభిలాష ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కుట్రతో పెట్టిన కేసులో చివరికి న్యాయమే గెలిచిందన్నారు. కవిత విడుదలైన సందర్భంగా కువైట్‌లో పెద్ద ఎత్తున సంబురాలు చేసుకున్నట్టు ఆమె పేర్కొన్నారు.



సమ్మిట్ లోగోను ఆవిష్కరిస్తున్న అధికారులు

## రేపు 'ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024'

సిటీబ్యూరో: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో ప్రైవేట్ సెక్యూరిటీ అవసరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఈ నేపథ్యంలో ఈ నెల 30న హైదరాబద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో నేషనల్ ఫిజికల్ సెక్యూరిటీ సమ్మిట్-2024ను నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. హెచ్‌సీఎస్‌సీకి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా అదనపు కమిషనర్(లా అండ్ అర్డర్) విక్రమ్ సింగ్ మాన్, సెక్రటరీ జనరల్‌గా శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ ఫిజికల్ సెక్యూరిటీ ఫోరం ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో నిర్వహిస్తున్న ఈ సమ్మిట్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమ్మిట్ ముగింపులో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్ లోగోను విడుదల చేశారు.

## జీహెచ్‌ఎంసీలో మరో 4 కమిటీలు





సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో మరో నాలుగు కమిటీలను ఏర్పాటు చేస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ అండ్ రోడ్ మేనేజ్‌మెంట్, స్మార్ట్ పోల్ టెండరింగ్ కమిటీ, స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్టుపై కమిటీలు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ అండ్ రోడ్ మేనేజ్‌మెంట్ కమిటీలో జీహెచ్‌ఎంసీ (ట్రాఫిక్ అండ్ ఐటీ) అదనపు కమిషనర్ కన్వీనర్‌గా జీహెచ్ఎంసీ ఈఎన్సీ, హెచ్ఎండీఏ ఉమ్టా ఎండీ, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఉన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, టీఎంసీ (ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం), పార్కింగ్ పాలసీ, జీఐఎస్ విధానం అమలుపై కమిటీ ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి తగిన నిర్ణయాలను అమలు చేయనున్నది. దీంతో పాటు స్మార్ట్ పోల్ టెండరింగ్ కమిటీలో జీహెచ్‌ఎంసీ (అడ్వర్టైయిజ్‌మెంట్) అదనపు కమిషనర్ కన్వీనర్‌గా, జీహెచ్‌ఎంసీ ఐటీ విభాగం అదనపు కమిషనర్, ఎలక్ట్రికల్ విభాగం అదనపు కమిషనర్ ఉన్నారు. సిటీ స్ట్రీట్ లైటింగ్ ప్రాజెక్టు కమిటీలో జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అదనపు కమిషనర్ కన్వీనర్‌గా, జీహెచ్‌ఎంసీ ట్రాఫిక్ విభాగం అడిషనల్ కమిషనర్, ఎస్‌డబ్ల్యూఎంసీఈకి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా స్ట్రీట్ వెండర్ పాలసీపై కమిటీ వేశారు. యూసీడీ విభాగం అదనపు కమిషనర్ కన్వీనర్‌గా, ఎస్టేట్ విభాగం అదనపు కమిషనర్‌గా , ఉమ్టా ఎండీ, జీహెచ్‌ఎంసీ సీసీపీకి కమిటీలో బాధ్యతలు అప్పగించారు.

### నిలిచిన నిర్మాణ రంగ అనుమతులు

జీహెచ్‌ఎంసీలో నిర్మాణ రంగ అనుమతుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. టీఎస్ బీపాస్ వెబ్‌సైట్ సర్వర్ మెయింటెనెన్స్‌లో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నుంచి సేవలు నిలిచిపోవడంతో దరఖాస్తుదారులు, బిల్డర్లు ఇబ్బందులుపడ్డారు. బిల్డింగ్ కమిటీ పూర్తయిన వెంటనే సేవలకు అంతరాయం ఏర్పడటంతో భవన నిర్మాణ అనుమతులు, ఓసీలు, ప్రొసిడింగ్స్ జారీ నిలిచిపోయింది. సాయంత్రం దాటినా వెబ్‌సైట్ తెరుచుకోలేదు. దీంతో అధికారులు సైతం చేసేది ఏమి లేక వచ్చిన విజిటర్లకు సమాధానం చెప్పలేక తలలు పట్టుకున్నారు. వాస్తవానికి పని వేళల్లో సర్వర్ మెయింటెనెన్స్ నిర్వహించకూడదు. కానీ టీఎస్ బీపాస్ టెక్నికల్ స్టాఫ్ దరఖాస్తుదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయేలా చేశారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం టీఎస్ స్థానంలో టీజీ మార్చే క్రమంలో తాత్కాలిక అంతరాయం ఏర్పడిందన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అధికార వర్గాల నుంచి విభిన్న వాదనలు వచ్చాయి. టెక్నికల్ ఇబ్బందులను సరిచేసే క్రమంలో సర్వర్ డౌన్ అయిందని చెప్పారు. మొత్తంగా వందలాది నిర్మాణ రంగ అనుమతులు నిలిచిపోయి బిల్డర్లు, భవన యజమానులు నిరాశ చెందారు. గురువారం నుంచి టీఎస్ బీ పాస్ వెబ్‌సైట్ వినియోగంలో ఉంటుందని, సేవలు యధావిధిగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## ఆలస్యంగా మేల్కొన్న ఐటీ వింగ్

### హ్యాకింగ్ అయిన వివిధ యాప్‌ల పునరుద్ధరణ

సిటీబ్యూరో: ఇన్నాళ్లు తన పనిని పక్కన పెట్టేసిన సిటీ పోలీస్ కమిషనరేట్‌లో ఐటీ విభాగం..ఆలస్యంగానైనా మేల్కొంది. రెండు నెలల కిందట తెలంగాణ మొబైల్, కంప్యూటర్ అప్లికేషన్లు హ్యాకింగ్ గురికావడంతో సిటీ ఐటీ విభాగం పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఈ క్రమంలో ఇప్పుడిప్పుడే మేల్కొని.. అప్లికేషన్లను పునరద్ధరిస్తోంది. ఇందులోభాగంగానే హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వెబ్‌సైట్‌ను రెండు రోజుల కిందట పునరుద్ధరించారు. పోలీసింగ్‌కు మానవ వనరులు ఒక ఎత్తయితే, టెక్నాలజీ కూడా అందుకు తనవంతు సహకరిస్తూ శాంతి భద్రతల పర్యవేక్షణ, నేర నివారణలో తోడ్పాటునందించాయి. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ప్రజలు, పోలీస్ శాఖలో అంతర్గత సేవల కోసం ఉపయోగించిన అప్లికేషన్లపై ఫోకస్ తగ్గించారు. ఇంతలోనే ఆయా అప్లికేషన్లపై హ్యాకర్స్ విరుచుకుపడ్డారు. దీంతో వాటిని మొత్తానికే పక్కన పెట్టేంత పనిచేసేశారు. అప్పటికే పోలీస్ వ్యవస్థలో చాలా పనులు, పర్యవేక్షణ ఆయా మొబైల్ అప్లికేషన్‌తో జరగడంతో, సిబ్బంది పనితీరు, ప్రజలకు వేగంగా సేవలు అందించే ప్రక్రియకు ఆటంకం కలిగింది. పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా పెట్రోలింగ్ వ్యవస్థ మారిపోయింది. అయితే ఇప్పుడు పరిస్థితులన్నీ తిరిగి యధాస్థితికి వచ్చాయని, అప్లికేషన్ల పునరుద్ధరణ జరగడంతో పర్యవేక్షణ కొనసాగుతుందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

## మంకీపాక్స్‌తో భయం వద్దు

### సపోర్టింగ్ ట్రీట్‌మెంట్‌తో చెక్ పెట్టవచ్చంటున్న వైద్యులు

సిటీబ్యూరో, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): మంకీ పాక్స్‌తో భయం అవసరం లేదని వైద్యనిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ర్టాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాకపోయినప్పటికీ గాంధీ, నల్లకుంట ఫీవర్ వైద్యశాలల్లో ముందస్తుగా ఐసొలేషన్ వార్డులు ఏర్పాటు చేయడంతో మంకీ పాక్స్‌పై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే మంకీ పాక్స్ అనే వైరస్ కొత్తేమీ కాదని, అది పాతదే అని, సపోర్టింగ్ ట్రీట్‌మెంట్‌తో వైరస్‌కు చెక్ పెట్టవచ్చని వైద్యులు అంటున్నారు. 1950లో తొలిసారిగా ఈ వైరస్‌ను కోతుల్లో గుర్తించడం వల్ల దీనికి మంకీ పాక్స్ అనే పేరు వచ్చిందని చెప్పారు. ప్రారంభంలో కోతులకు వచ్చిన వైరస్.. క్రమంగా వాటి నుంచి మనుషులకు సోకింది. ఆ తరువాత ప్రస్తుతం మనుషుల నుంచి మనుషులకు సోకుతోందని అంటున్నారు.

### మరణాల రేటు చాలా తక్కువ..

మంకీపాక్స్ అనేది ఆర్థోఫాక్స్ జాతికి చెందిన ఒక వైరస్. ఇది కొన్ని సార్లు మెదడు లేదా ఇతర అవయవాలకు కూడా వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ల వల్ల కొంత మందిలో పరిస్థితి విషమించే అవకాశాలుంటాయి. మంకీ పాక్స్ కేసుల్లో మరణాల రేటు చాలా తక్కువ. రోగి శరీరంపై నీటి బుడగలు ఏర్పడతాయి. ఈ బుడగల్లోని నీరు అంటే ఫ్లూయిడ్స్, లేదా శరీరంలోని ఫ్లూయిడ్స్ వల్ల ఇది ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుంది. అంతేతప్ప.. కరోనా లాగా రోగి తుమ్మినా, దగ్గినా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. రోగిని తకినప్పుడు అతడి శరీరంలోని ఫ్లూయిడ్స్ అంటితేనే ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. జ్వరం, ఇతర వైరల్ ఫీవర్ లక్షణాలతో పాటు రోగి ఒంటిపై నీటి బుగ్గలు వస్తే దానిని మంకీ పాక్స్‌గా అనుమానించాల్సిందే. ఈ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటే వైద్యులను సంప్రదించి.. తగిన చికిత్స తీసుకోవాలి.

**-డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్ యాదాద్రి భువనగిరి ప్రభుత్వ దవాఖాన**



మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్న కాంగ్రెస్

### అసెంబ్లీ స్పీకర్‌కు సైతం ఫిర్యాదు చేశా: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్, ఆగస్టు 28 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ విమర్శించారు. ప్రొటోకాల్‌కు తిలోదకాలు ఇవ్వడంపై అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బుధవారం శ్రీనగర్ కాలనీ డివిజన్ నవోదయ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం బేఖాతరు చేస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి చెక్కులను పంపిణీ చేసేవారమన్నారు. డివిజన్ల వారీగా సభలు పెట్టి లబ్ధిదారులకు చెక్కులతో పాటు బహుమతులనూ ఇచ్చానని గుర్తుచేశారు. ఇప్పుడు ఈ చెక్కులను ఆయా ఎమ్మార్వో కార్యాలయాల్లోనే ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్చి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించినట్లు అధికారులు అంటున్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే పెద్దదైన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, బాలానగర్, అమీర్‌పేట, ఖైరతాబాద్, షేక్‌పేట్ మండలాలు ఉన్నాయన్నారు. పేద ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాలంటే రవాణా ఖర్చులవుతాయన్నారు. ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నట్లు ప్రజలు తన దృష్టికి తెచ్చారని, అవినీతికి తావులేకుండా గతంలోనే మాదిరిగానే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## పోలీస్ స్టేడియానికి పేట్లబుర్జులో స్థలం

సిటీబ్యూరో: గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనాన్ని నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఈమేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం గోషామహల్‌లో ఉన్న పోలీస్‌స్టేడియానికి ప్రత్యామ్నాయంగా భూమి కేటాయించేందుకు బహదూర్‌పురలోని పేట్లబుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీలోని స్థలాన్ని పరిశీలించారు. త్వరలో ప్రభుత్వానికి స్థలం అప్పగింతపై నివేదిక ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ భాస్కర్, ఇన్‌చార్జి ఆర్డీఓ జ్యోతి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అజమాబాద్‌లోని ఎస్‌ఆర్‌టీ నగర్ కాలనీని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ దశరథ్ సింగ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొయినుద్దీన్ ఉన్నారు.